# ప్రవాసాంధ్రులు — పొలిటిక్సు వేరే
# మరో తెలుగోడి గోడు

పిప్పళ్ళ సూర్యప్రకాశరావు

*"తెలుగు సినిమా వచ్చింది గురో!" అని అరిచాడు పాపారావు పరుగెత్తుకొచ్చి.*

'సౌత్ ఇండియన్ హోటల్'లో కూర్చున్న మోహన్రావు అప్పటిదాకా మింగలేక బాధపడుతున్న ఇడ్లీలాంటి పదార్థాన్ని, గబుక్కున మింగేసి గటాగటా నీళ్ళు తాగేశాడు.

"అయితే గురూ ! నిజంగా తెలుగు సినిమా వచ్చిందంటావా ?" అని అనుమానంగా అడిగాడు.

"నిజం గురూ ! నీ మీద ఒట్టు" అని మోహన్రావు నెత్తిమీద చేయిపెట్టాడు.

"ఒరేయ్ ! ఒరేయ్ ! తెలుగు సినిమా గురించి నే చచ్చిపోవాల్రా" అని ఏడుపుమొహం పెట్టాడు, మోహన్రావు.

"భయపడకు గురూ ! తెలుగు సినిమా ఇక్కడకు వచ్చినా రాక పోయినా నీవు మాత్రం చావవు. ఈ వూళ్ళో నాయరు హోటల్లో తిండితింటున్న ఏ విధవా అంత తేలిగ్గా చావదురా !" అంటూండగానే "పిల్చారా ?" అంటూ వచ్చాడు నాయరు, మాసిపోయిన లుంగీని మడిచి కట్టుకుంటూ.

"అబ్బే లేదే ? మావాడేదో తెలుగు సినిమా గురించి చెప్తూ. . . ."

"ఏందయ్యా ? తెలుగు సినిమాగానే ! ఎక్కడయ్యా ? నాకు భలే ఇష్టమయ్యా ? ఎక్కడాడ తదయ్యా ?" అనడిగాడు.

వెంటనే పాపారావు సవినయంగా చేతులు జోడించి,

"నాయరో ! నీ పాతబాకీ నీకిచ్చేస్తాను గాని, నీవు తెలుగు మాత్రం మాట్లాడకు" అనిప్రార్థించాడు.

"ఏందయ్యా ? నాకు తెలుంగు రాదనే ? అసలు నేను బడ్డీకొట్టు పెట్టింది భీమవరంలో నయ్యా· ఖర్మయ్యా, ఖర్మ. మీలాంటి దిక్కులేని వాళ్ళకు వండిపోయిటాన్కి ఇక్కడకొచ్చానుగాని, నాతెలుంగుకేం ?" అని వాదానికి దిగాడు.

మోహన్రావు కలగజేసుకుని "మా వాడి మాట లేంగాని, కొంతమంది ప్రవాసాంధ్రులు కంటే నీవు చాలా నయం నాయరూ ! ఏదీ రెండు కప్పులు స్ట్రాంగ్ కాఫీపట్రా" అన్నాడు.

పాపారావు వంక నాయరు గుర్రుగాచూసి "రెండు కాఫీ" అని గట్టిగా అరిచాడు.

"ఏరా ! అరువిస్తున్నాడుకదా అని నాయరుకి గాలి కొడతావురా ?" అని నిలదీసాడు పాపారావు.

"అదిసరేగాని తెలుగు సినిమా అన్నావు. ఎక్కడ? ఎప్పుడు ?" అని టాపిక్ మార్చాడు

"అప్సరలో "ఈద్" రోజున.

"అదేంటి గురూ !"

అది అంతే అప్సర ప్రొప్రయిటరు ఈ మధ్యన హైద్రాబాద్ వెళ్ళాడులే. బహుశ అక్కడున్న మన వాళ్ళు తెలుగుకంటే ఉర్దూయే బాగా మాట్లాడి ఉంటారు."

"ఎన్నాళ్ళకు పేల్చావుగురూ ! జోకొకటి" అని ఫక్కున నవ్వాడు మోహన్రావు.

శ్రుతి కలిపాడు పాపారావు.

"కుషీకా బాత్ హై క్యా ?" అంటూ కుర్చీ లాక్కున్నాడు భీంసింగ్.

"ఖాస్‌బాత్ హై జరూర్. హమారా పిక్చరు ఏక్‌టోయిథర్ ఆనే వాలా హై"అన్నాడు మోహన్రావు

"అచ్ఛా ! రియల్లీ ! యునో ఐలైక్ యువర్ మద్రాసీ లాంగ్వేజ్ మళయాళం" అన్నాడు భీంసింగ్

పాపం పాపారావుకి బైటనున్న ఎండకంటే ఎక్కువగానే ఒళ్ళు మండిపోయింది. భీంసింగ్ గడ్డం పట్టుకుని పీకేద్దామనుకున్నాడు. కాని దాన్కి చుక్కలగుడ్డ అడ్డువుండటంవల్ల ఆ ప్రయత్నం మానుకున్నాడు.

"ఒరేయ్ సింగూ ! నీవెప్పుడైనా ఇండియామేప్ చూసావా ? దక్షిణాదిన నాల్గు రాష్ట్రాలున్నాయిరా. నాల్గు. ఒక్కొక్కళ్ళకు ఒక్కొక్క భాష ఉందిరా." అని లోలోపలే అనుకుని.




"మిస్టర్ వుయ్ ఆంధ్రాస్ స్పీక్ తెలుగు, ఇటలియన్ ఆవ్ ది ఈస్ట్" అన్నాడు పైకి.

ఈలోగా "కలుస్తా గురూ. బిల్లిచ్చెయ్యి" అ సైకిలెక్కాడు పాపారావు.

* * *

కొత్తగా వచ్చిన తెలుగు ఆఫీసర్ని కాకా పట్టాల పాపారావు పడ్డపాట్లన్నీ చిత్తయి పోయాయి. వాళ్ళత్త గారు పంపిన కొత్త ఆవకాయ జాడీడు పట్టుకెళ్ళిస్తే

"ఐలైక్ దిస్ పికిల్ వెరీమచ్. థాంక్యూ' అన్నాడు.

కనీసం ఆవకాయను ఆవకాయ అంటాడేమో అ పాపారావు ఎంతో ఆశపడ్డాడు. ఇంతెందుకు ఆఫీసులో డ్రాఫ్టు తప్పురాస్తే తెలుగులో తిడత డేమోనని ఎంతో వుబలాట పడుతుంటాడు. కా ఆఫీసరు మాత్రం తెలుగెక్కడ దొర్లుతుందేమో నని చాల జాగ్రత్తగా ఇంగ్లీషులోనే పాపారావు తిట్టేవాడు.

కాని ఈ సారి పాపారావుకి ఆ సదవకాశాన్ని జారవిడుచుకోవడం ఇష్టంలేదు. ఆఫీసరు సినిమాల పిచ్చని తెల్సు. తెలుగు సినిమా వచ్చిందంటే ఎగిరి గంతేయవచ్చు.

ఆలోచించుకుంటూ ఆఫీసరింటికి వచ్చాడు పాపారావు. వరండాలో ఎదురైన పాపను పట్టుకుని

"పాపా ! నీపేలేంటి ? నాపేలు పాపాలావు. మీ నాన్నగాలున్నాలా ?" అన్నాడు.

పాప బొద్దుగా, ముద్దుగా వుంది, చిత్రంగా కళ్ళు తిప్పుతూ.

"క్యా హై ? ఆప్ కవున్ హై ? క్యా కావ్ హై ?"అని ప్రశ్నల వర్షం కురిపించితే చతికిలబడిపోయాడు పాపారావు. ఇంతలో "షీలా !" అంటూ వచ్చాడొక పన్నెండేళ్ళ కుర్రాడు. కుర్రాడితో "చూడు నాయనా ! నాన్నగారున్నారా ? ఉంటే చెప్పు. ఆఫీసులో నిద్రపోయే, సారీ పన్జేసే పాపారావు వచ్చాడని" అన్నాడు.

"సారీ ! ఐకాంట్ ఫాలో యూ" అని విసవిసా నడిచి వెళ్ళిపోయాడు, శ్రీనగల శ్రీనివాసరావు గారబ్బాయి.

(సారీ ! ఎస్. ఎస్. రావ్ గారబ్బాయి.)

ఇంతలో పాపారావు ఎదురు చూస్తున్న ఆఫీసరు పాపారావు ఎదురుగా వచ్చాడు.

పాపారావు సవినయంగా నమస్కరించి

"సార్ ! తెలుగు సినిమా వచ్చింది సార్ ! సార్ ! తెలుగు సినిమా. . తెలుగు సినిమా. . ." రెట్టించాడు.

ఆఫీసరుకి, చెవిటివానికి చెపుతున్నట్టుగా—

"సో వాట్ ?" అని బిల్డింగ్ అదిరేటట్టుగా అరిచాడు ఆఫీసరు.

పాపారావుకి మూర్ఛవచ్చినంత పనైంది.

కాని పడుకుని దొర్లితే, దార్ని పోయే వాళ్ళు డబ్బు లిసురుతారేమోనని భయపడి ఆ ప్రయత్నం మానుకున్నాడు. కాస్సేపటికి చెదిరిపోయిన ధైర్యం కూడగట్టుకుని, బెరుగ్గా "సార్ ! పదేళ్ళలో తెలుగు సినిమా ఈ వూర్కి (రూర్కెలా) రావడం ఇదే ప్రథమం . . ."

"సో వాట్‌కెన్నైడూ ? నో శ్లైవ్స్" అని విసుగ్గా సిగా పాపారావు వంక చూసాడు ఆఫీసరు.

పాపారావు జుట్టు పీక్కుని, పిచ్చివాడిలా రోడ్డు మీద పడ్డాడు. యిక్కడున్న తెలుగు వాళ్లందరికీ తెలుగు సినిమా చూడటం నామోషి కాబోలు!

తనపై ఆఫీసర్లతో బెంగాలీ, పంజాబీ, మళయాళ సినిమాలకు చీమడు ముక్కలతో ఉన్న పల్లకాయలతో సహా బయల్దేరే ఆఫీసరు మరి మన తెలుగు సినిమాకి రాడేం ? లేక పోతే తను తెలుగు వాడన్న సంగతి, 'తెలుగు సినిమాకెళితే,అందరికీ తెల్సి పోతుందేమో !

*　　*　　*

మెల్లగా మలుపు తిరుగుతున్న మాణిక్యాలరావుని, స్పీడ్‌గా సైకిలు మీద వస్తున్న పాపారావు "గురో తెలుగు సినిమా వచ్చింది గురో !" అని కేకేసాడు.

కేక విని మాణిక్యాలరావు అదిరిపడ్డాడో లేక, తెలుగు సినిమా మీద మోజు పడ్డాడో తెలియదు కాని, మొత్తం మీద బేలన్స్ తప్పిపడ్డాడు.

పాపారావు పరుగెత్తుకొచ్చి జబ్బట్టుకుని లేవదీసి, "దెబ్బలు తగిలాయా ?" అన్నాడు.

"చాల్లే వెధవ పలకరింపులు నువ్వూను." అది కస్సుమన్నాడు మాణిక్యాలరావు.

"అది కాదు గురూ ! మన సినిమా వచ్చిందని చెపుదామని." అన్నాడు.

ఆవిధంగా హుషారుగా యీల వేసుకుంటూ పాపారావు సైకిలు టైర్లు అరిగేదాకా తెలుసున్న వాళ్లకు, తెలియని వాళ్లకు, తెలుగు వాళ్లకు, తెలుగొచ్చినా తెలుగు మాట్లాడని వాళ్లకు, తెలుగు వాళ్లమని చెప్పుకోడానికి సిగ్గుపడే వాళ్లకూ, అందరికీ చెప్పాడు.

*　　*　　*

ఆ రోజు—

పాపారావు మిత్ర బృందం సిటీ బస్సు యెక్కి అప్సర వైపు పయనించ సాగారు. అనుకోకుండా కొందర్ని అదృష్టం వరిస్తుంది. పాపారావు పక్కన ఉన్న ఖాళీసీట్లో, పంజాబీ దుస్తుల్లో ఒక సన్నటి, నున్నటి అమ్మాయి కూర్చుంది. తుపుక్కున తుమ్మారు మిత్ర బృందంలో ఎవరో.

"ఛాన్సు కొట్టావుగురూ !"

"ఒరేయ్ కొంచెం సేపు ఆ సీటు నాకివ్వరా ?"

"చిలక బాగుందే !"

"ఎక్కడ పట్టావోయ్ పాపారావ్ ?"

"ప్రయర్ ఎప్పాయింట్‌మెంటా గురూ ?"

"తెలుగుసినిమాకి తీసుకు వెళుతున్నావా గురూ?"

"పాపారావు—పక్కన అమ్మాయి. జంటబాగుంది కదరా ?"

"ఏడిశావ్ ఆ అమ్మాయి నా పక్కన వుంటే మరీ బావుంటుందిరా !"

"అసూయవు వెధవల్లారా! అల్లరి చేయకండి. పిట్ట పారిపోగలదు." అన్నాడు పాపారావు.

ఫక్కున నవ్వారు అందులో వున్న ప్రవాసాంధ్రులందరు.

"మిష్టర్ ! ఒళ్ళు దగ్గర పెట్టుకుని, మాట్లాడు. పళ్లూడగలవు." అని ఆ చిలక, స్టాపు వస్తే దిగి వెళ్లిపోయింది.

పాపారావుకి కళ్లు తిరిగినవి.

"తెలుగులోనే తిట్టిందా గురూ?" సందేహం వచ్చింది మిత్ర బృందంలో ఒకరికి.

యింతలో ఒక నడి వయసుకురాలు, ముడి సవర జేసుకుంటూ లేచి "అవును నాయనా స్వచ్ఛమైన తెలుగులోనే తిట్టి వెళ్లింది. యింకా నయం. అమ్మాయి మంచిది కాబట్టి సరిపోయింది." అని పాపారావు దగ్గర కెళ్ళి "చూడు బాబూ యిక్కడ తెలుగువాళ్ళు రెండు వేల పై చిలుకు వున్నారు. కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడటం నేర్చుకో.




నీ కోసమే చెపుతున్నానుబాబూ. కాలుకో, చేయికో నష్టం వస్తే కష్టం బాబూ" అని తనూ దిగిపోయింది.

దాంతో మొహాలు వేలాడేసిన మిత్ర బృందం సిన్మా టాకీసుకి వచ్చే సరికి హాలు ముందు ఎవరూ లేరు.

"బిగినయిందేమో గురూ" అని కంగారుగా పాపారావు వెళ్లేసరికి—

"అనివార్య కారణాల వల్ల యీ రోజు తెలుగు సినిమా వేయనందుకు చింతిస్తున్నాము"

అని యింగ్లీషులో బోర్డు వుంది. అది చూసి మిత్ర బృందం పాపారావుని పట్టుకోబోతుంటే పారిపోయాడు.

*　　*　　*

మర్నాడు నాకు కనపడి, "సారీ గురూ! మిమ్మల్నందర్నీ శ్రమ పెట్టాను. అయినా నాకర్థం కావడం లేదు. హాలువాడు తెలుగు సినిమా ఎందుకు వేయలేదంటావు? మనమంటే సినిమా వాడికీ అలుసయి పోయిందా గురూ?" అని అన్నప్పుడు నాకు పాపారావు మీద బోలెడంత జాలి కలిగింది అవును ఆ రోజు ఆంధ్రదేశానికి వేలమైళ్ళ దూరంగా తెలుగు సినిమా ఎందుకు ఆడలేదు?

నిజం చెప్పనా? చెపితే మీరు నమ్మక పోవచ్చు. కొన్ని నిజాలు వినడానికి సొంపుగా వుండవు. నమ్మడానికి అసలే బావుండవు.

ప్రవాసంలో వున్న "ఆంధ్ర కళా సంస్థలు"లోని రాజకీయాలే కారణం. ఈ సంఘాలు కళామ తల్లికి సేవ చేయక పోయినా, చీట్ల పేక సేవకే అంకితమై పోయాయి.

తమ వాళ్లకెపుడూ సహాయం చేసుకునే సంకుచిత బుద్ధి ఆంధ్రులకు ఎపుడూ లేనట్టే వారి కళా సమితి కూడా ఆంధ్రులకు ఏమీ చేయకపోయినా వూళ్ళో వాళ్లకు చాలా ఉపకారం చేసిపెట్టింది.

సమితి పెట్టక మునుపు వూళ్లో పేకాడే వాళ్ల సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టేవారు. కాని యిప్పుడు పేకాటకు ఆల్ కాంటే!

వచ్చిన వెంటనే ప్రశిడెంటుగారు యింటికి పట్టుకెళ్లి చింపుకొచ్చిన సినిమా రంగాలతో, సెక్రటరీగారి చంటోడు చింపేసిన చందమామలతో, నెల క్రితం వచ్చిన దిన పత్రికలతో, దయామయులైన మెంబర్లు తిరిగి తీసుకొచ్చి యిచ్చిన అట్టలూడి పోయిన పుస్తకాలతో, సాహితీ సేవ కూడా చేస్తుంది.

తెలుగు సమితి కదా అని అందరూ తెలుగు మాట్లాడుకుంటారని అనుకునేరు. తెలివితక్కువ పాపారావు, మరో యిద్దరు ముగ్గురు తప్ప మిగతా వాళ్లంతా యింగ్లీషులోనే మాట్లాడుకుంటారు.

ఇహ పాలిటిక్స్ అంటారా? అడక్కండి! ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా పరిషత్తులు, పంచాయితీ సమితులు చాలా నయం అనిపిస్తుంది!

కొత్తమొహం ఎపుడైనా అడుగు పెడితే "మన యింటి పేరు ఏమిటి?" అని అడుగుతారు. తెలివైన వాళ్ల అతితెలివిగా "కులాలు" నిర్ణయించేది ఈ ప్రశ్నతోనే.

సమితికి ఫ్యాక్టరీ వాళ్ల ఇచ్చింది రెండు చిన్న గదులున్న క్వార్టరయినా, ఒక గదిలో అధికార వర్గీయులు, మరో గదిలో అసమ్మతి వర్గీయులు పేకాడటం రివాజు.

ఆ రెండు గ్రూపులు ఎప్పుడూ ముష్టి యుద్ధానికి తలపడకుండా ఉండేటట్లు కాబోలు మధ్య నున్న తలుపు ఎప్పుడూ మూసే వుంటుంది.

నోరు లేని పెద్ద మనిషిని ప్రశిడెంటుగాను, అప్పులెక్కువగా వున్న వాణ్ణి ట్రెజరర్‌గాను, తెలుగు రాని వాణ్ణి సెక్రటరీగాను ఎన్నుకోవడం కద్దు.

ఎలక్షన్ల ముందు అధికారంలోని పార్టీ ఎన్నో వాటికి ప్రారంభోత్సవములు చేసినట్లుగానే, ఎలక్షనులు వస్తున్నాయి కదా అని సమితిలోని అధికార వర్గీయులు తెలుగు సినిమా ఒకటి తెప్పించి, ప్రవాసాంధ్రుల్ని మెప్పించి, మరో యేడాది పాటు అధికారములో వుండాలని ఉబలాటపడ్డారు.

కాని అసమ్మతి వర్గీయులు ఆ విషయం ముందుగానే పసిగట్టి తెలుగు సినిమా ఆ వూరికి రాకుండా గట్టి ప్రయత్నాలు చేశారు.

"ఫిలిం బాక్స్" ఆ రోజుకి ఆ వూరికి రాకుండా రైల్వేలో పన్జేసే ఒకానొక రామారావు గారు సాయపడితే—

ఆర్. ఆర్. సకాలంలో హాలు వాడికి అందకుండా పోస్టల్‌లో పన్జేసే ఒకానొక వెంకట్రావుగారు చేతనయిన విధంగా తోటి ప్రవాసాంధ్రులకు సేవ చేశాడు.—"అయ్యా ఇదీ గోడు"